ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760

ధర్మవరం, పుట్టపర్తి : 9963160529

కదిరి :9052518170

ఏసీఎమ్: 9985411154

ఓం నమఃశివాయ



భోగసముద్రం చెరువులో విద్యుత్ దీపాలంకరణలో ధ్యాన యోగేశ్వరుడు

నేడు మహాశివరాత్రి... ముస్తాబైన ఆలయాలు

హిందూ పండుగల్లో ముఖ్యమైనది మహా శివరాత్రి. బుధవారం పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. వారి శివనామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి. ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రికి భక్తులు ఉపవాసం ఉండనున్నారు. రాత్రి జాగరణ చేయనున్నారు. ఇందుకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

-పెనుకొండ(ఆంధ్రజ్యోతి)



హిందూపురంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న దక్షిణామూర్తి ఆలయం వద్ద ప్రత్యేక అలంకరణ

ఇంధనం మోసం..!

పెట్రోల్ బంకుల్లో తక్కువ కొలతలు

- స్మార్ట్‌గా దోచుకుంటున్న నిర్వాహకులు
- విజిలెన్స్ తనిఖీల్లో మైక్రో చిప్‌ల గుట్టురట్టు
- సేవలపై నిర్లక్ష్యం.. అమలుకాని నిబంధనలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నా యి. కొందరు నిర్వాహకులు ఇంధన కొలతల్లో తేడాలతో వినియోగదారులను దోచుకుంటున్నారు. పంపుల్లో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చి, డిస్‌ప్లే మదర్‌బోర్డుల ట్యాంపరింగ్‌తో డీజిల్, పెట్రోల్ వినియోగదారుల్ని మోసగిస్తున్నారు. పెట్రోల్ పంపుల్లో మైక్రో చిప్‌లు అమర్చి డిస్‌ప్లే ద్వారా మదర్‌బోర్డుల ట్యాంపరింగ్‌తో ఇంధన ప్రవాహానికి అంతరాయం కల్గించి వినియోగదారుల్ని దోపిడీ వైనం ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. మానవ ప్రమేయ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి పెట్రోలు బంకుల్లో ఎలక్ట్రానిక్ డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్ల అందుబాటులోకి తెచ్చారు. కొందరు నిర్వాహకులు సాంకేతికతను అడ్డుపెట్టుకుని సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు. కళ్లెదుట ఇంత భారీ దోపిడీ జరుగుతున్న పర్యవేక్షణ చేయాల్సిన శాఖలు నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా పెట్రోల్ బంకుల్లో ఇంధన నిబంధనలే కన్పించడంలేదని తనిఖీల్లో గుర్తించినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వెల్లడిస్తున్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



పెట్రోల్ బంకు

అనుమానం నివృత్తి ఎక్కడ..?

వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ నింపేటప్పుడు బంకుల్లో తిరిగే డిజిటల్ మీటర్ రూ.5కు మించి జంప్ కాకుండదు. అంతకు మించితే మోసం చేస్తున్నట్లే. జిల్లాలో చాలా బంకుల్లో మీటర్ల వ్యత్యాసం అధికంగా ఉంది. ఒకే సారి రూ.15 ఆపై జంప్ అవుతున్నాయి. ఇదేమని అడిగితే మా స్పీడ్ ఎక్కువతో ఇలా అవుతోందని పంప్ బాయిస్ సమాధానం ఇస్తున్నారు. నాణ్యతపై ఎవరైనా అనుమానం వ్యక్తం చేస్తే ఐదు లీటర్ల క్యాన్‌లో ఇంధనం పోసి వినియోగదారులకు చూపాలి. పెట్రోల్ కల్తీ ఉన్నట్లు అనుమానం వస్తే బంకు యజమానులు వినియోగదారులకు లిట్మస్‌పేపర్‌పై ఒక చుక్క పెట్రోల్ వేసి చూపాలి. డీజిల్ నాణ్యతపై అనుమానాలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి. పెట్రోల్ బంకును పరిశీలించి నాణ్యత గుర్తించే డెన్సిటీ పరీక్షలు చేస్తారు. కొలతలు తక్కువ ఉన్నా, నాణ్యత లోపముంటే పౌరసరఫరాల శాఖ అధికారులు కేసులు నమోదు చేయాలి. వినియోదారుల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉన్నా ఇవేవి చాలా బంకుల్లో అమలు కావడంలేదు. పైగా వినియోగదారులనే ఎదురు ప్రశ్నలతో భయపెడుతున్నారనే విమర్శలున్నాయి.

సూక్ష్మంగానే లక్షలు స్వాహా

జిల్లాలో 80కిపైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. రోజువారిగా సగటున పెట్రోల్ 3 లక్షలు, డీజిల్ 3.5 లక్షల లీటర్ల దాకా వినియోగిస్తున్నట్లు అంచనా. చాలా బంకుల్లో పెట్రోల్, డీజిల్ వినియోగదారుల నుంచి సూక్ష్మంగానే లీటర్‌పై దోపిడీ సాగుతోందన్న వాదన ఉంది. పెట్రోల్ బంకుల్లో డిజిటల్ నంబరింగ్ సిస్టమ్ అందుబాటులో ఉన్నా, కొన్ని చోట పెట్రోల్, డీజిల్ నింపే సమయంలోనే పంపుబాయ్ చేతిలోనే ఈవ్యవహారం నడిస్తోంది. పెట్రోల్, డీజిల్ డిస్‌ప్లే మీటర్ రీడింగ్ కరెక్ట్‌గానే చూపిస్తుండటంతో ఈ మోసాన్ని వినియోగదారులు పసిగట్టలేకపోతున్నారు. కొనుగోలు చేసిన ఇంధనానికి బిల్లు ఇవ్వమని అడిగితే చాలా చోట్ల బిల్లింగ్ మిషన్ పనిచేయలేదని చెబుతున్నారు. దీన్ని బట్టే పక్కా మోసం అని తేటతెల్లమవుతోంది. కర్ణాటకకు ఆంధ్రాకు డీజల్, పెట్రోల్ ధరల మధ్య లీటర్‌పై రూ. 6నుంచి రూ. 8 వ్యత్యాసం ఉంది. దీంతో పెట్రోల్ బంకుల నిర్వాహకులు అక్కడ నుంచి ఇంధనాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇటీవల పట్టుబడిన ఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ నిల్వల వివరాలు తెలిపే బోర్డులు తప్పనిసరిగా, అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినప్పుడు, జనరేటర్ కచ్చితంగా ఉండాలి. కొలతల శాఖ అనుమతి పత్రాలు ఉండాలి. ప్రమాదాలు నివారించేందుకు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఇలాంటి నిబంధనలు అక్కడక్కడ మాత్రమే కన్పిస్తున్నాయి.

కానరాని వసతులు

లాభార్జన ధ్యేయంగా పెట్రోల్ బంకుల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ఇంధన మంత్రిత్వ శాఖ ప్రమాణాలను యథేచ్ఛగా విస్మరిస్తున్నారు. బంకుల్లో ఎలక్ట్రానిక్ డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్ల లావాదేవీలు జరగాలి. కొన్ని చోట్ల జరుగుతుండగా కొన్నిచోట్ల పాత పద్ధతిలో కొనసాగుతున్నాయి. ప్రతి బంకులో నిబంధనల ప్రకారం వాహనాల టైర్లకు ఉచితంగా గాలి పెట్టుకునే సౌకర్యం కల్పించాలి. చాలా చోట్ల జరగడంలేదు. చాలా బంకుల్లో ప్రథమ చికిత్స కిట్లే కానరావడం లేదు. తాగునీరు, మరుగుదొడ్ల సంగతి సరేసరి. బంకుల్లో ఎక్కడా స్టాక్ వివరాలే కన్పించడంలేదు. కార్మిక శాఖకు సంబధించిన నిబంధల రికార్డులు నిర్వహణ కన్పించడంలేదు. సూచనలు, ఫిర్యాదు పెట్టెలు అందుబాటులో లేవు. సైన్ బోర్డులు ధరల బోర్డులు, కల్తీని తనిఖీ చేయడానికి పోస్టర్లు ప్రదర్శించడం లేదు.

తనిఖీ శాఖలెక్కడ..?

బంకుల్లో అక్రమాలు జరుగుతున్నా పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు(లీగల్ మెట్రాలజీ) శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తోంది. డిజిటల్ నంబరింగ్ సిస్టమ్‌లో పెట్రోల్ బంకుల్లో వినియోగదారులను మోసం చేయడం కష్టం. నిర్వాహకులు తక్కువ ఇంధనం వేస్తున్నారనేది అపోహ. ప్రతి పెట్రోల్ బంకు తనిఖీ చేస్తున్నాం. ఎక్కడైనా కొలతల్లో తక్కువ వచ్చినట్లు వినియోగదారులు ఫిర్యాదు చేస్తే తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటున్నామని పెట్రోల్ బంకులపై పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖ చెబుతున్నాయి. అయితే తనిఖీలెక్కడ జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైస్థాయిలో ఒత్తిళ్లు వచ్చినప్పుడు తూతూమంత్రగా తనిఖీలు చేసి ఆ ఫొటోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యత్యాసం కనిపించలేదు

రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో భాగంగా పౌరసరఫరాలు, తూనికలు, కొలతల శాఖ అధికారులతో కూడిన మూడు బృందాలు ఇటీవల హిందూపురం, చిలమత్తూరులో పలు పెట్రోల్ పంపుల్లో తనిఖీలు చేపట్టాం. ప్రతి బంకులో ఎలక్ట్రానిక్ డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్లు నంబరింగ్ సిస్టమ్‌లు పని చేస్తున్నాయి. ఈ విధానంలో వినియోగదారులను మోసం చేయడం కష్టం. నిర్వాహకులు తక్కువ ఇంధనం వేస్తున్నారనేది అపోహ. ప్రతి పెట్రోల్ బంకు తనిఖీ చేస్తున్నాం. ఎక్కడైనా కొలతల్లో తేడా వచ్చినట్లు వినియోగదారులు ఫిర్యాదు చేస్తే, తనిఖీ చేసి, వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటాం.

-సుధాకర్, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు కొలతల శాఖ



పూర్ణాహుతితో యజ్ఞాన్ని ముగిస్తున్న పండితులు

ముగిసిన మహాయజ్ఞం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



యజ్ఞంలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో అతిరుద్ర మహాయజ్ఞం ముగింపు కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది భక్తులు తరలివచ్చారు. పూర్ణాహుతి తో వేదపండితులు యజ్ఞాన్ని మంగళవారం ముగించారు. మొదట విద్యార్థులు వేదం పఠించారు. పండితులు మహాగణపతి పూజతో యజ్ఞాన్ని కొనసాగించి శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య వేదపండితులు అతిరుద్ర మహాయజ్ఞాన్ని పూర్ణాహుతితో ముగించారు. యజ్ఞోపిత జలాన్ని పండితులు భక్తులపై చల్లించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ దంపతులు యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం గో పూజ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌పాల్గొని పూజలు చేశారు. 12 రోజులు పాటు జరిగిన యజ్ఞం ముగింపు సందర్భంగా సాయికుల్వంతు మందిరం భక్తులతో కిటకిటలాడింది. 11హోమాలలో వందలాది మంది పండితుల వేదమంత్రాలతో ప్రశాంతినిలయం మార్మోగింది.



శివలింగానికి అభిషేకం చేస్తున్న పండితుడు

పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రస్తుతం సింగిల్‌విండో పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీసహాని, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఎల్‌డీఎం రమణకుమార్, నాబార్డు ఏజీఎం అనురాధ, ఏపీఎఫ్ఎఫ్‌సీ ప్రకాష్, డిక్కీ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ పాల్గొన్నారు.

కర్నూలులో కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలి

జలసాధన సమితి డిమాండ్

హిందూపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కర్నూలులో కృష్ణానది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జలసాధన సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ.. కృష్ణానది నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 65 శాతం నుంచి 70శాతం సాగుభూమికి నీరిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో విజయవాడ ప్రాంతంలో కృష్ణానది బోర్డు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అనంతపురం జిల్లాకు మూడుశాతమే మాత్రమే నీరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జలసాధన సమితి అధ్యక్షుడు రాంకుమార్, నాయకులు వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి, ఆనందరంగారెడ్డి, సోమకుమార్, నవీన్, సిద్దారెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జలసాధన సమితి నాయకులు

మస్టర్లలో అవకతవకలు

సామాజిక తనిఖీల్లో బట్టబయలు

12.20కోట్ల పనుల్లో రూ. 1.72లక్షలే అవినీతి



టెక్నికల్ అసిస్టెంట్లను హెచ్చరిస్తున్న పీడీ విజయప్రసాద్

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామి పథకంలో జరిగిన అవినీతిని అధికారులు వెల్లడించారు. 2023-24సంవత్సరానికి గాను ఉపాధిహామి పథకంతో పాటు ఇతర శాఖలలో రూ.12.20కోట్లు నిధులు ఖర్చుచేశారు. గత వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి, పనులను పరిశీలించింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ ప్రజావేదికలో డ్వామా పీడీ విజయప్రసాద్, క్లస్టర్ ఏపీడీ వెంకటచలపతి, అంబుడ్స్‌మెన్ అధికారి శివారెడ్డి ఏఓ అబ్దుల్‌నబీ, ఏపీఓ అనిల్‌కుమార్, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్ డీఆర్‌పీల ఆధ్వర్యంలో ఓపెన్‌ఫోరంను నిర్వహించారు. డీఆర్‌పీలు ప్రజావేదికలో నివేదికలను చదివి వినిపించారు. సామాజిక తనిఖీలో మస్టర్లలో ఎక్కువగా అవకతవకలు పాల్పడటం, చేయని పనులకు చేసినట్లు రికార్డుల్లోకి ఎక్కించడం, కొలతల్లో తేడాలు, పనిప్రదేశాల్లో ఎక్కడ సూచిక బోర్డులు గానీ ఏర్పాటు చేయకపోవడం వంటివి గుర్తించామని తనిఖీ బృందం పేర్కొంది. ప్రిసైడింగ్ అధికారి విజయప్రసాద్ జరిగిన అవినీతిపై రికవరీకి ఆదేశించారు. మండలంలో 20పంచాయతీలకుగాను రూ.12.20కోట్ల నిధుల్లో రూ.1,72,676 లక్షలు మాత్రమే అవినీతి జరిగినట్లు వివరాలను వెల్లడించారు. అతి తక్కువ మొత్తం రికవరీకి ఆదేశించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మస్టర్లను తనిఖీ చేయకపోతే సస్పెండ్ చేస్తాం

టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధిహామీ పనుల వద్ద మస్టర్లను ప్రతిరోజు తప్పని సరిగా తనిఖీ చేయాలి. వీటిపై ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. నిర్లక్ష్యంగా ఉంటే టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తాం. పనుల నాణ్యత, కూలీల మస్టర్ల తనిఖీను టెక్నికల్ అసిస్టెంట్లు పర్యవేక్షణ చేయాలని ప్రజావేదిక ద్వారా టెక్నికల్ అసిస్టెంట్లుకు సూచిస్తున్నా. ఇప్పటికే మీపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. మీడియా ద్వారా కథనాలు కూడా వస్తున్నాయి. విధులలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు.


-విజయప్రసాద్, డ్వామా పీడీ

42 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈఐఈఓ రఘునాథ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి ఒకటో తేదీన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒకటి నుంచి 19 వరకు ప్రథమ సంవత్సరానికి, మూడో తేదీ నుంచి 20 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఈఐఈఓ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 115 కళాశాలకు చెందిన 23,987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. ఇందులో బాలురు 11,531 మంది, బాలికలు 12456 మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్లు 423 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇద్దరు, సిట్టింగ్ స్క్వాడ్ ఇద్దరిని, డిపార్ట్‌మెంటల్ అధికారులు 42 మంది, డీఈసీ మెంబర్లు ముగ్గురు, డీవీ ఒకరిని నియమించామన్నారు. ఇప్పటికే 42 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా రాయడానికి కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యంతో పాటు వైద్యసిబ్బందిని కూడా నియమించామని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.



అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు







బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన హిమాలయాల సెట్టింగ్, హిమలింగం, హిమాలయాల సెట్టింగ్ ముందు దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఈశా..మహేశా..!

శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు... నేడు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా బుధవారం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సమాయత్తమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పెనుకొండ సమీపంలోని ప్రకృతి ఒడిలో అలరారుతున్న శ్రీకైలాసం క్షేత్రంలో శివరాత్రి పర్వదినాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. అనంత జిల్లాలోని కంబదూరులో వెలసిన మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా పరమేశ్వరుడి పర్వదినానికి సిద్ధమైంది.

కొండ కోనల్లో రామలింగేశ్వరుడు



కోన రామలింగేశ్వరస్వామి

యాడికి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబయ్యింది. ఏటా మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ఇక్కడి శివలింగాన్ని పరశురాముడు ప్రతిష్ఠించినట్లు కోనుప్పలపాడు గ్రామ పెద్దలు చెబుతున్నారు. స్వామివారి దర్శనానికి యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల ప్రజలతోపాటు నంద్యాల జిల్లా ప్యాపిలి, అవుకు తదితర మండలాల ప్రజలు భారీగా తరలివస్తారు. ఆలయం చుట్టూ ఉండే కొండలతో ప్రకృతి రమణీయంగా గోచరిస్తుంది. ఆలయం ఎదురుగా ఉన్న కొలను గుండం, వర్షాకాలంలో కొలను గుండంలోని జాలువారే సహజ సిద్ధ జలపాతం కనువిందు చేస్తాయి. ఆలయం నుంచి అరకిలోమీటర్ దూరంలో కొండలపై నుంచి నిరంతరం జాలువారే సహజ సిద్ధ జలపాతం ఇక్కడి ప్రత్యేకత. వర్షాకాలంలో ఈ జలపాతం వద్దకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

అబ్బురపరిచే మర్రిచెట్టు



ఆలయం వద్ద ఎకరా విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు

కోనరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సుమారు ఎకరా విస్తీర్ణంలో పెద్దమర్రి చెట్టు విస్తరించి ఉంది. కోనకు వెళ్లిన భక్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా మర్రి ఊడలు పట్టుకొని ఊయల ఊగుతుంటారు. కోనకు వెళ్లిన వారు మర్రిచెట్టు కిందనే సేదతీరుతుంటారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏపీ టూరిజం, పల్లెపండుగ కింద రూ.37లక్షలు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి మరికొంత తన సొంత నిధులు వెచ్చించి కోనకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఆలయం వద్ద ఉన్న కోనేటి గుండంను శుభ్రం చేయించారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శ్రీకైలాసగిరి క్షేత్రంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

రేపు కల్యాణోత్సవం, రథోత్సవం

ఈనెల 27న కోన రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఓబులాపురం, కోనుప్పలపాడు గ్రామాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఇలపై శ్రీకైలాసం

పెనుకొండ రూరల్: మహా శివరాత్రి వేడుకలకు శ్రీకైలాసం క్షేత్రం సిద్ధమయ్యింది. ఈ క్షేత్రం మండలంలోని గొందిపల్లి సమీపంలోని కొండల మధ్య ఉంది. పెనుకొండ నుంచి 20కి.మీ. దూరంలో ఉన్న ఇక్కడ ఆలయంలో శివుడు లింగం రూపంలో దర్శనమిస్తారు. శ్రీకైలాసగిరి శిఖరం నుంచి జాలువారే నీటి మధ్యన 40అడుగుల శివుడి విగ్రహం నిర్మించారు. ఏడుగురు అక్కమ్మగార్లు, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం దాతల సహకారంతో నిర్మించారు. శివరాత్రి పండగరోజు పెనుకొండ, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వస్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు తిరుపతిస్వామి తెలిపారు. బుధవారం తెల్లవారుజామునుంచే శ్రీకైలాసగిరి క్షేత్రంలో స్వామివారికి అఖండజ్యోతి, ఆలయం ముందు హోమాలు, కైలాసనాథుడి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం



శ్రీకైలాసంలోని కోనేరు

మల్లేశ్వరుడి కల్యాణ వైభోగం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత కుటుంబసభ్యులు



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

కళ్యాణదుర్గం: కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, భార్య రమాదేవి, కోడలు ఇషిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కోడలు పరిటాల జ్ఞాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఇద్దరు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం, రాప్తాడు ప్రాంత వాసులకు జీవనాడి అయిన పేరూరు, బీటీపీ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి కావాలని ఆ పరమేశ్వరుడికి ప్రత్యేకపూజలు చేశామని వారు వెల్లడించారు. వారికి వేద పండితులు మల్లేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు



లేపాక్షిలో..

లేపాక్షి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాగణపతి సుదర్శనహోమం, యాగాలు నిర్వహించారు. సాయంకాలం గ్రామోత్సవంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజారోహణ, అంకురార్పణ విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణవేదికగా ఆలయం మారనుంది. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, దుర్గాదేవి



పురవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

జాతీయ హాకీ జట్టుకు ఎంపిక



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ జట్టుకు అనంతపురం, సత్యసాయి జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన లక్ష్మీరేవతి, సత్యసాయి జిల్లాకు చెందిన పావని సత్తా చాటి జట్టులో స్థానం సంపాదించారు. మార్చి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా జాతీయజట్టుకు ఎంపికైన క్రీడాకారిణులకు నెల్లూరు ఏసీ స్టేడియంలో ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్కే యతిరాజ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో సత్తా చాటాలన్నారు.

హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామ్మోహన్

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ బదిలీపై వచ్చారు. రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్ర భుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న రామమోహన్‌ను హెచ్చెల్సీ భూసేకరణ విభాగానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న వసంతబాబు కళ్యాణదుర్గం ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రుణాల ఇంటర్వ్యూలు మంగళశారం ముగిశాయి. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 18మంది దరఖాస్తులు చేసుకోగా 14 మందిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులకు అర్హతలు లేకపోవడంతో తిరస్కరించారు. మరొకరు గైర్హాజరయ్యారు. ఎంపికైన 14 మందికి రూ.33 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, మెప్మా పీడీ విశ్వజ్యోతి, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి మళ్లీ నీరు

అర టీఎంసీ విడుదల... కేసీ కెనాల్ వాటా మళ్లింపు

రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి అదనంగా అర టీఎంసీ నీటిని మంగళవారం సాయంత్రం బోర్డు అధికారులు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఇండెంట్ సమర్పించారు. కేసీ కెనాల్ వాటా నీటిలో అర టీఎంసీని హెచ్చెల్సీకు మళ్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టులో ఆలస్యంగా పంటలు సాగు చేయడంతో రెండు తడుల నీరు అందిస్తే కోత చేసుకోవచ్చనీ, అందుకోసం అర టీఎంసీ నీరు కేటాయించాల్సిందిగా వీరు కోరారు. దీంతో పంటను కాపాడుకునేందుకు వీరి విన్నపాన్ని మన్నించి రైతుల శ్రేయస్సు కోసం అర టీఎంసీ నీటిని హెచ్చెల్సీకి మళ్లిస్తూ భారీ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు.. బోర్డు అధికారులకు ఉత్తర్వులను పంపించారు. ఈ నేపథ్యంలో అర టీఎంసీ నీటి విడుదలకు అంగీకరిస్తూ.. మంగళవారం సాయంత్రం డ్యాంలో విడుదల చేశారు. వారం క్రితమే ప్రభుత్వం అర టీఎంసీ నీరు అందించాలని ఉత్తర్వులు ఇచ్చినా.. కర్ణాటక మాత్రం కేసీ కెనాల్ నీటిని హెచ్చెల్సీకి మళ్లించకుండా అడ్డుకునే ప్రయత్నం చేసింది. బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయకుండా అడ్డుపడింది. అయినప్పటికీ మంత్రి, విప్ చొరవ చూపి బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కర్ణాటకను ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు. దీంతో ఆలస్యంగానైనా మళ్లింపు జలాలు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల ప్రకారం మార్చి 4వ తేదీ వరకు అర టీఎంసీ నీటిని తీసుకునేలా అధికారులు డిజైన్ చేశారు. ఇప్పటికే కర్ణాటక పరిధిలోని డిస్ట్రిబ్యూటరీల్లో జలచౌర్యానికి ఆస్కారం లేకుండా నేరుగా ఆంధ్ర సరిహద్దు వరకు నీరు చేరుకునేలా బోర్డు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. సింగిల్ ఇండెంట్ కావడంతో 0.5 టీఎంసీల జలాల్లో ప్రవాహ నష్టం అధికంగానే ఉంటుంది. ఇప్పటికే కాలువలో నీరు పూర్తిగా ఎండిపోవడంతో ప్రవాహ వేగం కూడా మందకొడిగా ఉండి బుధవారం అర్ధరాత్రికి ఆంధ్ర సరిహద్దుకు జలాలు చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు ఏర్పాట్లను పూర్తి చేసి, జీబీసీ వరకు జలాలను తరలించేలా చర్యలు చేపట్టారు. హెచ్ఎల్ఎంసీ పరిధిలో ఉన్న మొక్కజొన్నతోపాటు జీబీసీలోని మిర్చి పంటలను నీటిని రెండు తడులుగా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జీబీసీ వరకు నీటిని ప్రవహించేలా చేసుకుని అక్కడ నుంచి ముందుకు వెళ్లకుండా కణేకల్లు చెరువు వద్ద నుంచి నీటిని వినియోగించుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు.

జిల్లాను సారా రహితంగా మారుద్దాం

- సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టరు, ఎస్పీ, జేసీ ఇతర అధికారులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు చైతన్యం కలిగించి, జిల్లాను సారా రహితంగా మారుద్దామని కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నవోదయం2.0పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ నాటుసారా ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక మూలాలను దెబ్బతీస్తుందనే ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులందరూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు రెండునెలలు పాటు నిర్వహించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో మద్యం పీడిత గ్రామాలును ఏబీసీ కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. ఏ కేటగిరీలో 24గ్రామాలు, బీ కేటగిరీలో 44గ్రామాలు, సీ కేటగిరీలో 36 గ్రామాలు ఉన్నాయన్నారు.

డ్రోన్లతో నాటుసారా ప్రాంతాలపై నిఘా: ఎస్పీ

నాటుసారా నివారణకు కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. నాటుసారా తయారు చేసే అటవీప్రాంతాలతో పాటు అనుమానం ఉన్న ఏరియాలలో డ్రోన్‌లతో తనిఖీలు నిర్వహిస్తూ నిఘా ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, విద్య వెల్ఫేర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి



మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల నిర్మాణ సంస్థలో ఐసీఎం గిడ్డంగి నియంత్రణ అభివృద్ధి వారి ఆధ్వర్యంలో గిడ్డంగుల వినియోగంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరుణకుమారి, రాష్ట్ర ఐసీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యాంకుమార్, గిడ్డంగుల నిర్మాణ సంస్థ డీఎం ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రోషన్ జమీజర్, సీఈఓ శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే రైతులు తమ దిగుబడులను నిల్వ చేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగులను నిర్మించాయన్నారు. అద్దె చెల్లింపులు ప్రైవేట్ గిడ్డంగుల కంటే కూడా తక్కువేన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన దిగుబడులకు సంబంధించిన అధికారులు ఇచ్చే రసీదులను తీసుకువెళ్లి బ్యాంకులో రుణాలు కూడా పొంద వచ్చునన్నారు. కార్యక్రమంలో కొడిమి, నరసనాయనికుంట, సోములదొడ్డి, పాములరాయి. కురుగుంట, అక్కంపల్లి, నాగిరెడ్డిపల్లి, రాచానపల్లి, చిన్నంపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పీ4 సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న శ్రీమంత్‌సాయి

బత్తలపల్లి ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లితోపాటు మండలంలోని పోట్లమర్రిలో మం గళవారం పీ4 సర్వే రాష్ట్ర పరిశీలకుడు శ్రీమంత్‌సాయి పర్యటించారు. సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేపై అపోహాలు అవసరం లేదని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో గణాంకాల అధికారి శర్మ, వీఆర్వో రాణాప్రతాప్ పాల్గొన్నారు.

అడ్డగోలుగా హక్కులు..!

వైసీపీ పాలనలో ఫ్రీహోల్డ్ మాటున అంతులేని అక్రమాలు.. బాధ్యులపై చర్యలు కరువు

పుట్టపర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ మాటును గత వైసీపీ పాలనలో యథేచ్ఛగా భూఆక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు, ఆ పార్టీ అనుకూల వ్యాపారులు పేదల భూములను అడ్డదారుల్లో కొట్టేశారు. రెవెన్యూ యంత్రాంగం సహకరించడంతో అంతులేని అక్రమాలు సాగించారు. అసైన్డ్ ఫ్రీహోల్డ్ నిషిద్ధ జాబితా నుంచి తప్పించి భూములను కాజేసి లబ్ధి పొందారు. ఫ్రీహోల్డ్ మాటున జిల్లాలో వేల ఎకరాల్లో వందల కోట్ల రూపాయల విలువైన అసైన్డ్ భూదందా సాగింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ పేరుతో జరిగిన భూఅక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు కూట మి సర్కారు నిర్ణయించింది. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేశారు. ఫ్రీహోల్డ్, నిషేధిత భూములను వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై యథేచ్ఛగా కొట్టేశారు. భూఅక్రమాల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఫ్రీహోల్డ్‌తోపాటు రిజిస్ట్రేషన్లలో అక్రమాల పరంగా టాప్ 10 మండలాల జాబితాను సీసీఎల్‌ఏ ప్రకటించింది. అందులో జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల పరంగా ముదిగుబ్బ అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత మరో ఐదు మండలాలున్నాయి. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలో పెనుకొండ అగ్రస్థానంలో నిలిచింది. భూచోళ్లకు వందల కోట్ల విలువైన భూములు కట్టబెట్టేందుకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునే వారెవరన్న చర్చ సాగుతోంది.



కలెక్టరేట్



ఫ్రీగా లక్షల ఎకరాలు..

జగన్ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూముల (యాజమాన్య హక్కుల కల్పన) ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి అక్రమంగా తప్పించడమే కాకుండా కొన్నింటికి రిజిస్ట్రేషన్లు చేయించి అసైన్డ్ చుక్కల, ఇనామ్, షరతుగల, అసైన్డ్ పట్టా ఫ్రీహోల్డ్ భూములను దోచేశారు. 2003 ఏడాదికి ముందు అసైన్డ్‌మెంట్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉన్నా.. తర్వాత ఇచ్చిన వాటికీ చోటు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 32 మండలాల్లో 2,57,042.47 ఎకరాలను ఫ్రీహోల్డ్ పరిశీలించగా.. ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు విచారణలో లెక్కతేల్చారు. ఇందులో 1,26,215.19 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఫ్రీహోల్డ్ కల్పించిన భూముల్లో 5242.08 ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇందులో నిబంధనలు అతిక్రమించి 2,141.01 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు తేల్చారు. ఫ్రీహోల్డ్ చేసిన, రిజిస్ట్రేషన్ జరిగిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు కొందరు బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోళ్లు చేశారు. ఇదే అదునుగా తీసుకుని ఆయా నియోజకవర్గాల్లో కీలక ప్రజాప్రతినిధులు, నేతలు భూకబ్జాదారుల అవతారమెత్తారు. దేవదాయ, వంక పోరంబోకు, పరిశ్రమలు, అటవీ ఇలా అనేక రూపాల్లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఫ్రీహోల్డ్ కల్పించుకుని భూదందా చేశారు.

అక్రమాల్లో అగ్రస్థానం

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములతోపాటు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగిన మండలాల జాబితాను ప్రభుత్వం విడుదల చేస్తే మొదటి స్థానంలో ముదిగుబ్బ, రెండో స్థానంలో అమరాపురం, మూడో స్థానంలో రామగిరి నిలిచాయి. 6, 7, 9 స్థానాల్లో కనగానపల్లి, సోమందేపల్లి, పెనుకొండ నిలిచాయి. ముదిగుబ్బలో 14,509.88 ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చితే ఇందులో 13,538.48 ఎకరాలు అక్రమమని తేలింది. అమరాపురం మండలంలో 18,281.76 ఎకరాలకుగాను 10781.27 ఎకరాలు, రామగిరిలో 19877.20కిగాను 10410.83, కనగానపల్లిలో 14039.83కిగాను 8300.08, సోమందేపల్లిలో 10582.38కిగాను 7785.90, పెనుకొండలో 16205.06కిగాను 7501.68 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. పెనుకొండ మండలంలోని నాగలూరు, ఎర్రమంచి, శెట్టిపల్లి, మునిమడుగు, ధర్మవరం మండలంలోని కుణుతూరు, చిగిచెర్లలో భారీగా ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు వెలుగుచూశాయి.




ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్లలోనూ..

ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లలోనూ రాష్ట్రంలో టాప్ 10 జాబితాలో పెనుకొండ అగ్రస్థానం కైవసం చేసుకుంది. మూడోస్థానంలో ధర్మవరం, 6, 9 స్థానాల్లో సోమందేపల్లి, రొద్దం నిలిచాయి. పెనుకొండ, ధర్మవరం, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, సీకేపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ రిజిస్ట్రేషన్లు జరిగిగాయి. పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాల్లో ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్లలో వ్యత్యాసాలతోపాటు అక్రమాలు జరిగినట్లు నిగ్గుతేల్చారు. పెనుకొండలో 827.39 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా.. 326.10 ఎకరాలు అక్రమమే. ధర్మవరంలో 372.11 ఎకరాలకుగాను 264.49, సోమందేపల్లిలో 458.98కిగాను 207.56, రొద్దంలో 442.04కిగాను 194.15 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

అక్రమార్కులపై చర్యలేవీ?

వైసీపీ పాలనలో ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు రియల్ మాఫియా ముందస్తు ప్రణాళికతో పేదలు, మధ్యతరగతి వర్గాల అసైన్డ్ భూములను కారుచౌకగా కొనుగోలు చేశారు. పనిలో పనిగా రెవెన్యూలో కొందరు బేరం పెట్టారు. ఇష్టారాజ్యంగా ఫ్రీహోల్డ్ చేశారు. అక్రమాల పరంగా టాప్-10 మండలాల్లో అప్పట్లో ఆయా మండలాల్లో పనిచేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ఈనెల 4న జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. అయినా.. నేటికీ చర్యలకు ఉపక్రమించలేదన్న చర్చ నడుస్తోంది. ఫ్రీహోల్డ్ అక్రమాల మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లతోపాటు ఉద్యోగులు చాలామంది బదిలీ అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో కీలక మండలాల్లో పనిచేస్తున్నారు. కొందరు రెవెన్యూ ఉద్యోగులు ఆయా మండలాల్లో పక్క గ్రామాల్లోనే పనిచేస్తున్నారు. వారందరిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. క్షేత్రస్థాయి పరిశీలనలతో ఫ్రీహోల్డ్ అక్రమార్కుల్లో మొదట్లో ఆందోళన రేగింది. చర్యలు చేపట్టకపోవడంతో వారు కూడా పెద్దగా పట్టించుకోవట్లేదు. ఈ నేపథ్యంలో సీసీఎల్‌ఏ ఆదేశాలతోనైనా ఫ్రీహోల్డ్ అక్రమార్కులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో.. వేచిచూడాలి.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం


వినోద్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టిప్పర్ కింద పడి ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు...పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెద్దపోతలయ్య కుమారుడు వినోద్‌కుమార్(20) పదో తరగతి వరకు చదివి, తండ్రితో పాటు నాయిబ్రాహ్మణ వృత్తిని చేసేవాడు. ఈ క్రమంలో సిమెంట్ ఇటుకల లోడుతో ఓ టిప్పర్ బత్తలపల్లి వైపు నుంచి ధర్మవరం పట్టణంలోకి వెళ్తోంది. కదిరి గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేస్తున్నారు. అక్కడ వన్‌వే ఉంది. కదిరి గేటు వద్దకు టిప్పర్ రాగా, అదే సమయంలో వినోద్‌కుమార్ ద్విచక్రవాహనంపై పట్టణంలోకి బయల్దేరాడు. టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే సయంలో పక్కనే ఉన్న బురదగుంటలో ద్విచక్రవాహనం జారడంతో యువకుడు టిప్పర్ కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై మంగళవారం అదే ఊరికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మతిస్థిమితం లేని ఒంటరి యువతిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. కూలి పనులకు వెళ్లిన తల్లిదండ్రులు వచ్చిన తర్వాత ఆ యువతి వారికి విషయం తెలిపింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ యువరాజు విచారణ చేపట్టారు.

బాలికకు వివాహం

ఐదుగురిపై కేసు నమోదు

కూడేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికకు వివాహం చేయడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని ఓ గ్రామంలో మైనర్‌కు వివాహం చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ అరుణమ్మతోపాటు పోలీసులు.. బాలిక కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, వివాహం చేయమని హామీ పత్రం రాయించుకున్నారు. అయినా ఈనెల 16న అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తితో బాలికకు వివాహం అయినట్లు ఫొటోలు బయటకు రావడంతో అప్రమత్తమైన ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెళ్లి కొడుకుతోపాటు, ఇరువురి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాలికను ఐసీడీఎస్ అధికారులు పిల్లల హోంకు తరలించారు.

పార్ట్‌నర్స్‌కు టోకరా

రూ.60లక్షలతో ఉడాయించిన వైనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ప్యాకేజీ టూర్ పేరుతో అనంతపురం నగరానికి చెందిన సనత్‌కుమార్ రూ.60లక్షలతో ఉడాయించాడు. ఈ విషయంపై అతడితో పాటు భాగస్వాములుగా ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లోని రాణిపూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుంచపు సాంబశివుడు, మలే రామారావు, మదుపూరు శ్రీహరి, కాళసముద్రం సనత్‌కుమార్‌తో కలిసి టూరిస్ట్ ప్యాకేజీ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే ఫిబ్రవరి 21న 237మంది మూడు రాత్రులు, నాలుగు పగళ్లు ఉండేలా ప్యాకేజీని బుక్ చేసుకున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. టూరిస్ట్ ప్యాకేజీలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు, త్రివేండ్రం, నుంచి బాగ్డోగ్రాకు విమాన టిక్కెట్లను కొనుగోలు చేశారు. ఇందు కోసం సుమారు రూ.60లక్షలు ఖర్చు చేశారు. గాంగ్‌టక్ చేరుకోగానే సంబంధిత వ్యక్తులు విమాన టికెట్‌ల మొత్తం ఈనెల 21న రూ.60లక్షలు చెల్లించారు. అయితే సనత్‌కుమార్ మొత్తం డబ్బు తీసుకొని కనిపించకుండా పోయాడు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మిగిలిన ముగ్గురు అతడిపై అక్కడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాణిజ్య పన్నుల శాఖలో కలకలం

వర్గపోరు.. జీరో ఎఫెక్ట్‌తో నలుగురిపై వేటు

సీటీఓ, ముగ్గురు డీసీటీఓల సస్పెన్షన్

హిందూపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేయడం కలకలం రేపింది. వర్గపోరు, అవినీతి ఆరోపణలు, వేధింపులు, క్రమశిక్షణ రాహిత్యం, జీరో వ్యాపారం ఎఫెక్ట్‌తో వేటు పడింది. హిందూపురంలోని సహాయ కమిషనర్, రాష్ట్ర పన్నులశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల శాఖాధికారి (సీటీఓ) కృష్ణవేణి, ఉప వాణిజ్య పన్నుల శాఖాధికారు (డీసీటీఓ)లు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇంతియాజ్ బాషాను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొంపముంచిన వర్గపోరు

హిందూపురం వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో సీటీఓ, డీసీటీఓలు కింది స్థాయి సిబ్బంది వర్గపోరులో మునిగారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ డీసీటీఓ.. ఉన్నతాధికారిపై ఆర్టీఐ యాక్ట్ ద్వారా కొంత సమాచారాన్ని వేరేవారి ద్వారా కోరారు. ముఖ్య అధికారి అప్పటి నుంచి కొంత గుర్రుగా ఉన్నారు. గతేడాది సెప్టెంబరు 27న సీటీఓగా కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత నుంచి కార్యాలయంలో వర్గపోరు లోలోపలే సాగుతోంది. ఇటీవల ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ వారి మధ్య సఖ్యతలేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు దీనిని సీరియస్‌గా పరిగణించారు.

జీరో ఎఫెక్ట్..

ఉమ్మడి జిల్లాలోనే హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. రాష్ట్ర సరిహద్దులో ఉంది. దీంతో ఇక్కడ జీరో వ్యాపారం జోరుగా సాగుతోందనీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్‌టీ ఎగ్గొడుతున్నట్లు తెలిసింది. ఆ శాఖలో పనిచేస్తున్న వారికి ప్రతినెలా లక్షల్లో వ్యాపారం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పన్ను వసూళ్లలో కార్యాలయంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. పట్టుచీరలు మొదలుకుని గుజిరీ వ్యాపారం వరకు జీరోలో నడుస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఓవైపు కార్యాలయంలో మూడు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. వీరు ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో హిందూపురంలో ఏం జరుగుతుందోనని విచారణకు ఆదేశించారు.





విచారణ నివేదిక అందగానే చర్యలు

హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు పన్నులు రాబట్టే కన్నా.. సంపాదనలోనే పోటీపడినట్టు తెలిసింది. హిందూపురం నుంచి నిత్యం ఇతర ప్రాంతాలకు వేలాది చీరలు వెళ్తుంటాయి. దీనిపై 5 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. ఇక్కడ కొంతమంది అధికారులు జీఎస్‌టీ కంటే సొంత జేబులు నింపుకోవడానికి ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం. కర్ణాటక నుంచి డీజిల్ పెద్ద ఎత్తున తరలిస్తుంటారు. కియ పరిశ్రమ వద్ద వందలాది వాహనాలకు కర్ణాటక నుంచి డీజిల్ సరఫరా అవుతున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణలో తేల్చారు. నిత్యం వేలాది లీటర్లు డీజిల్ కర్ణాటక నుంచి ఇక్కడికి వస్తుండటంతో ఇది పన్నుల శాఖ అధికారులకు తెలిసి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరాతీసినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఈనెల 17న విచారణకు వచ్చిన అధికారి కార్యాలయంలో వర్గపోరుతో పాటు వ్యాపారుల నుంచి జీఎస్‌టీ, కొంతమందిని బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. ఆ శాఖ అదనపు కమిషనర్ నాగేంద్ర, సంయుక్త కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ.. డీలర్లతో సమావేశమయ్యారు. సీటీఓ, డీసీటీఓ, ఏసీటీఓ, సీనియర్ అసిస్టెంట్లను వేర్వేరుగా విచారించి, నివేదికను కమిషనర్ పంపారు.

కలకలం

హిందూపురం వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సీటీఓ, ముగ్గురు డీసీటీఓలను సస్పెండ్ చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆ శాఖలో కలకలం రేగింది. నెలరోజులుగా హిందూపురం పన్నులశాఖ కార్యాలయం రచ్చకెక్కింది. దీంతో రాష్ట్ర అధికారులు ఆగమేఘాల మీద స్పందించి నలుగురిపై వేటు వేశారు. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న మరికొంతమందిలో వణుకు పుట్టింది. నలుగురితోనే సరిపెడతారా, తమపై కూడా చర్యలుంటాయా అని ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నప్పగుడి వద్ద ఎర్రితాత పక్కీరప్ప ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. న్యూ కేటగిరీ విభాగంలో 10 కాండ్లు(జతలు) తలపడ్డాయి. వీటిలో అనంతపురం జిల్లా అక్కంపల్లె గ్రామం ఇంద్రారెడ్డికి చెందిన వృషభాలు 6058.8 అడుగులు రాతిదూలంను లాగి మొదటి బహుమతి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ. 50వేలు అందజేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి బ్రదర్స్ ఎద్దులు 5900 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 35వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా మల్లెల మండలం డీ రంగాపురం గ్రామం రామకృష్ణారెడ్డి వృషభాలు 5800 అడుగులు లాగి మూడో బహుమతి రూ.25వేలు సొంతం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా పీ రుద్రవరం ఎల్లా గౌడ్, డీ రంగాపురం రామచంద్రారెడ్డికి చెందిన ఎద్దులు 5577.9 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ. 15వేలు సాధించాయి. కర్నూలు జిల్లా బోగులు శేషయ్య, మల్లెల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు 5200 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.10వేలు కైవసం చేసుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. బుధవారం ఆరు పళ్ల విభాగము వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కౌన్సిల్ వేదికగా వర్గపోరు

రాయదుర్గం వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

రెండు గ్రూపులుగా చీలిన వైసీపీ కౌన్సిలర్లు

రసాభాసాగా మారిన కౌన్సిల్ సమావేశం


మహిళా కౌన్సిలర్‌తో వాదిస్తున్న మరో సభ్యుడు

రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఉన్న వర్గపోరు కౌన్సిల్‌మీట్‌లో భగ్గుమంది. రాయదుర్గం మున్సిపల్ కౌన్సిలర్ల మధ్య మంగళవారం వివాదం తారస్థాయికి చేరుకుంది. రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గ పొరాళ్ల శిల్పపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేయాలని ఒక వర్గం, ఆమెను కొనసాగించాలని మరో వర్గం పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి సగం మంది కౌన్సిలర్లు హాజరు కాలేదు. 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కౌన్సిలర్ల గైర్హాజరుతో ఆలస్యంగా ప్రారంభించారు. చివరకు 16 మంది కౌన్సిలర్లు హాజరుకావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశాన్ని ప్రారంభించారు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న కౌన్సిలర్ అజయ్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు తగినంత మంది సభ్యులు లేనపుడు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఈక్రమంలోనే ఒక్కొక్కరు చైర్‌పర్సన్‌పై ఉన్న అసంతృప్తిని వెళ్లగక్కుతూ స్వరం పెంచారు. ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇదే క్రమంలో కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు దూషణలు ప్రారంభించారు. అధికారులు సముదాయించే ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో రెండు గ్రూపులుగా చీలిపోయిన వైసీపీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకునే స్థాయికి వెళ్లారు. పరిస్థితిని గమనించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశాన్ని 4 గంటలకు వాయిదా వేశారు. దీంతో గందరగోళ పరిస్థితి కౌన్సిల్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి చాంబర్‌కు చేరుకుంది. అక్క డ ఉన్న కొందరు కౌన్సిలర్ల భర్తలు వైసీపీ నాయకులు కౌన్సిలర్లతో పాటు చాంబర్‌లోకి ప్రవేశించి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఒక వైపు 13 మంది మరో వైపు 14 మంది రెండు గ్రూపులుగా విడిపోయి ఎక్కడికక్కడ విడివిడిగా వాగ్వాదాలు చేసుకుంటూ దాడులు చేసుకునే స్థాయికి పరిస్థితి వెళ్లింది. మున్సిపల్ కమిషనర్ పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా రూ.50 వేలు తీసుకుని సమావేశానికి వచ్చారని కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి మహిళ కౌన్సిలర్‌పై ఆరోపణలు చేయడంతో చైర్‌పర్సన్ సహా మహిళా కౌన్సిలర్లంతా ఆయనపై తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఒకొక్కరిగా అక్కడి నుంచి పంపేయడంతో వివాదం సద్దుమణిగింది. వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఉన్న చిచ్చు కారణంగా ప్రజా సమస్యలు చర్చించే పరిస్థితి లేకుండా పోయిందని టీడీపీ కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి మండిపడ్డారు. వైసీపీలో ఉన్న వర్గపోరును తీసుకొచ్చి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి అంటగట్టడం సరైంది కాదని వారు హితవు పలికారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ. 16తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 119 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 530 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

వామ్మో..! ఎయిడ్స్?

హత్యాయత్నం బాధితురాలికి పాజిటివ్..

నిందితుడికి కూడా..

ఆమెతో సన్నిహితంగా మెలిగిన వారిలో టెన్షన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎవరినైనా చంపడానికి ప్రయత్నిస్తే కేసు, రిమాండు లాంటివి ఉంటాయి. కానీ ఎయిడ్స్ రావడమేంటి? ఇటీవల జరిగిన ఓ హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి ఇలానే జరిగింది. ఇటీవల ఓ మహిళపై ఓ వ్యక్తి హత్యాయత్నం చేశాడు. ఆమెకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేయగా ఆమె ఎయిడ్స్ బారిన పడినట్లు తేలింది. దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు పెట్టే సమయంలో పోలీసులు పరీక్ష చేయించగా.. అతడికి కూడా ఎయిడ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆ మహిళ మరికొంతమందితో సన్నిహితంగా మెలిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వారందరూ టెస్టుల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రభుత్వాసుపత్రి, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నట్లు సమాచారం.

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఐటీఐ విద్యార్థి పవన్‌కుమార్ (20) మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేసులు తెలిపిన మేరకు నార్పల మండలం నర్సాపురానికి చెందిన గుజ్జల రామాంజనేయులు, గుజ్జల లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్దవాడు అయిన పవన్‌కుమార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డ్రాఫ్ట్సమెన్ సివిల్ బ్రాంచులో రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈక్రమంలోనే వ్యసనాలకు అలవాటు పడినట్లు తెలిసింది. దీంతో రెండు నెలలుగా ఇంటికి కూడా వెళ్లకుండా నగరంలోనే ఉండిపోయాడు. తల్లిదండ్రులు నగరానికి వచ్చి వ్యసనాలు మానుకొని, బుద్ధిగా చదువుకోవాలని మందలించి వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ స్థానిక పీటీసీ సమీపంలోని లక్ష్మీనగర్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అయితే ప్రేమ విఫలం కావడంతోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్న ప్రచారం జరుగుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా

కొత్తచెరువు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా కొట్టారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు అందిస్తామని ఎంపీడీఓ నటరాజ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.... గతంలో జరిగిన సర్వసభ్య సమావేశాల్లో పలు సమస్యలపై ఫిర్యాదు చేశామని, ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని, ఇక సమావేశాలు నిర్వహించడం ఎందుకని ఎంపీడీఓను నిలదీశారు. ఎంపీటీసీ రఫీ మాట్లాడుతూ.. హౌసింగ్ ఏఈ వెంకటేశ్ నాయక్, సిబ్బంది ఆ కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో ఉండటం లేదని, కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. అనేక మంది రోజుల తరబడి ఆ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, కనీసం మూడు రోజులకు ఒకసారైనా ఆఫీస్‌కు వస్తే.. ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ ... విధులను నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హౌసింగ్ ఏఈకి ఆదేశించారు.


సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రశాంతంగా పండగ చేస్కోండి: ఎస్పీ


కాటకోటేశ్వర క్షేత్రంలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రత్న

తాడిమర్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు శాంతియుతంగా మహాశివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రత్న సూచించారు. మండలంలోని కాటకోటేశ్వర క్షేత్రాన్ని ఆమె మంగళవారం సాయంత్రం సందర్శించారు. శివరాత్రి పర్వదినం రోజు ఆలయ ప్రాంగణంలో ఎవరెవరు ఎలాంటి విధులు నిర్వహించాలో ఆదేశించారు. అనంతరం చిల్లవారిపల్లి గ్రామానికి చేరుకుని అక్కడి ప్రజలతో మాట్లాడారు. గ్రామ కమిటీని, ఆలయకమిటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని ఉత్సవాలు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపా రు. ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. స్థానిక పోలీసులతో పాటు సబ్‌డివిజన్‌లోని పోలీసు అధికారులు కూడా ఉత్సవాలలో పాల్గొని భద్రతను పర్యవేక్షిస్తారన్నారు. అనంతరం ఎస్పీ తాడిమర్రికి చేరుకుని ఉత్సవాల నిర్వహణ గురించి డీఎస్పీ హేమంత్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ కృష్ణవేణితో చర్చించారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్, ముదిగుబ్బ సీఐ శ్యామరావు, ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్, ముత్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

● బందోబస్తుకు 200 పోలీసులు
మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కాటకోటేశ్వరక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సబ్‌డివిజన్‌లోని 125 మంది కానిస్టేబుళ్లు, ఏపీఎస్పీ బ్యాచ్ నుంచి ఒక బెటాలియన్, ఆరుగురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలను కేటాయించినట్లు తెలిసింది. డ్రోన్ కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల ఏర్పాటు


జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్న భక్తులు

బుక్కపట్నం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలల్లో భాగంగా బుక్కపట్నంలో ఓంశాంతి నిర్వాహకులు ద్వాదశ జ్యోతిలింగాల ప్రతిమలను మంగళవారం ఊరేగించారు. అనంతరం వాటిని స్థానిక శివాలయంలో దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. ఈనెల 27 వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఓంశాంతి బ్రహ్మకుమారి నిర్వాహకులు తెలిపారు.

చిత్రావతి నదిలో కుంభమేళా జలాలు


చిత్రవతి నదిలో కలుపుతున్న కుంభమేళా జలాలు

బత్తలపల్లి ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం వద్ద కుంభమేళా జలాలను హైకోర్టు న్యాయవాది అంజనరెడ్డి మంగళవారం కలిపారు. ప్రయగ్‌రాజ్‌లోని గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంఘంలో పవిత్ర స్నానాలు ఆచరించి.. ఆ జలాలను తీసుకువచ్చి సంఘమేశ్వరం వద్ద చిత్రవతి నదిలో కలిపామని వివరించారు. దీంతో చిత్రవతి నదిలో స్నానాలు చేసిన భక్తులకు కుంభమేళాలో స్నానం చేసిన ఫలితం దక్కుతుందన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పీఎస్‌యూ జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర మూడో మహాసభలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ నుంచి ఎన్జీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్నా.. ఇంతవరకు తల్లికి వందనం, స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్, హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలను ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం వల్ల విద్యరంగం పూర్తిగా సర్వనాశనమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు ఏమూలకు సరిపోవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకీరాములు, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్మన్

విద్యుత్ అదాలత్‌కు 15 ఫిర్యాదులు

కదిరి అర్బన్, ఫిబ్రవరి 25: స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి పాల్గొన్నారు. మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించారు. విద్యుత్ అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు రామ్మోహన్ రావ్, సాంకేతిక సభ్యులు ఎల్ అంజనీకుమార్, కదిరి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోసెస్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


ధర్మవరం: నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జీవన్‌జ్యోతి పాఠశాలలో విద్యార్థులు మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఇందులో 500 మంది విద్యార్థులకు పైగా పాల్గొని.. 240పైగా సైన్స్, గణితం నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ రిస్సీ సిస్టర్, హెచ్ఎం సుజాత పాల్గొన్నారు.
● ఓబుళదేవరచెరువు : స్థానిక వేమారెడ్డిపల్లి సమీపంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డి, హెచ్ఎం శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

కదిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో పార్కింగ్ బాయ్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌పై దాడి చేసి.. చంపుతామని బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన కళ్యాణ్, జునైద్, బాబాఫక్రుద్దీన్ సోమశేఖర్‌పై దాడి చేసి బాధితుడి మోటార్ సైకిల్‌ను బలవంతంగా తీసుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తేనే అభ్యున్నతి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాశ్యత వారోత్సవాలకు చెందిన పోస్టర్‌ను స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మంగళవారం ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాశ్యతపై వివిధ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరికృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమలశాఖ జోనల్ మేనేజర్ సోనీసహానీ పాల్గొన్నారు.
● సౌర శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయండి : మడకశిర, కదిరి ప్రాంతాల్లో సౌర నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా నైపుణ్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించి.. నిరుద్యోగ యువకు నైపుణ్య శిక్షణా కేంద్రా ల ద్వారా శిక్షణ ఇవ్వాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమో చేసిన వారిని గుర్తించి వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

న్యూస్ బాక్స్

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

కొత్తచెరువు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల నుంచి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. అంగన్‌వాడీ కార్యకర్తలు.. విద్యార్థులకు బోధించాల్సిన అంశాలపై పూర్తిగా అవగాహన కల్పించినట్లు ఎంఈఓ జయచంద్ర తెలిపారు. ఇందులో ఐసీడీఎస్ సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ పుష్ప, అంగన్‌వాడీ సిబ్బంది, రీసోర్స్‌పర్సన్ సాయిశివ, ఈశ్వరప్ప, బింధుమాధవి పాల్గొన్నారు.
● ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలో ఆరు రోజులుగా అంగనవాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండలంలోని 103 మంది ఇందులో శిక్షణ పొందారు. వారికి ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ్‌కుమారిపాల్గొన్నారు.
● నల్లమాడ: స్థానిక ఎస్టీ బాలుర హాస్టల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని ఎంఈఓ సురేష్‌బాబు తెలిపారు. ఆరు రోజులుగా నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో చిన్నారులకు నేర్పే విద్య, ఆడించే ఆటలు తదితర వాటిపై అవగాహన కల్పించామన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత


నగదు అందజేస్తున్న నిజాం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఓడీసీ మండలానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు నిజాం తమ జన్మదినం సందర్భంగా ఆమడగూరు మండలం గాజులవారిపల్లిలో మాతృశ్రీ వృద్ధాశ్రమానికి రూ.15,276ను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి మంగళవారం అందజేశారు. తమవంతు ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం తమ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో తమవంతుగా పోగుచేసిన రూ.15,276ను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందజేశారు. వృద్ధులకు నిజాం, హసీనా దంపతులు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తొగటవీర క్షత్రియ కులానికి చెంది నీలకంఠ, లక్ష్మీల కుమార్తె జాహ్నవి కర్నూల్ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ విద్యార్థిని ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో తొగట వీర క్షత్రియ కల్యాణమండపం అభివృద్ధి సంఘం సభ్యులు రూ.80వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో ఆ సంఘం ప్రసిడెంట్ అశ్వర్థనారాయణ, సెక్రటరీ పూజారినారాయణ, ట్రెజరర్ మద్దన లక్ష్మీనరసింహులు, వైస్ ప్రసిడెంట్ బండారు ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు మంగళవారం పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఓసీ, బీసీ విద్యార్థులు రూ 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ప్రవేశ రుసుము చెల్లించి ఆన్‌లైన్ ద్వారా లేక పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి ఫొటో, ఆధార్‌తో ఆన్‌లైన్లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్లఓ మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఏప్రిల్ 20న ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 79890 75931, 96763 77280ను సంప్రదించాలన్నారు.

మహిళపై కత్తితో దాడి

తాడిమర్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నదరి గ్రామానికి చెందిన మల్లీశ్వరమ్మపై పూల ఓబయ్యపల్లి గ్రామానికి చెందిన ఆకులేటి అశోక్ మంగళవారం కత్తితో దాడి చేశాడు. మల్లీశ్వరమ్మ కూలీలకు మేస్త్రీగా వ్యవహరిస్తూ చీనికాయలు పీకేందుకు కూలీలను తీసుకు వెళ్లేంది. అందులో భాగంగా అశోక్‌ను కూడా ప నులకు తీసుకెళ్లేది. మంగళవారం మధ్యాహ్నం పుల్లనారాయణప ల్లి గ్రామంలోని చీనితోటలో కాయలు కోస్తుండగా మల్లీశ్వరిపై అ శోక్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన తోటి కూ లీలు అడ్డుపడటంతో అశోక్ పారిపోయాడు. మల్లీశ్వరి ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రిష్ణవేణి తెలిపారు.

రవాణా ఖర్చులు అందజేత

కదిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రత్యేక విభిన్న ప్రతిభావంతులకు స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద రవాణా ఖర్చులను ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుళరెడ్డి మంగళవారం అందజేశారు. పాఠశాలకు రావడానికి ప్రత్యేక విభిన్న ప్రతిభావంతులకు విద్యాశాఖ రవాణా ఖర్చులు, బాలికలకు ఉపకార వేతనం చెల్లిస్తారు. రావాణా ఖర్చులు 34 మందికి, సహాయకులకు 13 మందికి, బాలికల ఉపకార వేతనం 45 మందికి, ఇంటి వద్ద ఉండే వారికి 10 మందికి డబ్బులు వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేశారు. బ్యాం కు అకౌంట్ లేని వారికి వారి తల్లికి నగదు అందజేశారు. ఇందులో స్థానిక భవితకేంద్రం ఉపాధ్యాయులు సౌజన్య, అన్వేష్ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు


ముస్తాబైన నల్లమాడలోని శివాలయం

నల్లమాడ : మండలంలోని నల్లమాడ, రాగానిపల్లి, గోపేపల్లి, మసవంకపల్లి, వంటకుంటలోని భవనాశిని ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. శివాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆయా దేవాలయాల అర్చకులు తెలిపారు.

పొదుపుపై వ్యాసరచన పోటీలు

కదిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళల పొదుపు అనే అంశంపై వ్యాసరచన పోటీలు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సుజాత, సమీనా, సుజాతకు బహుమతులు అందజేశారు. ఇందులో సీడీపీఓ రాధిక, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏపీ రమణకుమార్, ఎంఈఓ ఓబుళరెడ్డి, బ్యాంక్ కౌన్సిలర్లు వీరమారుతి, నారాయణ పాల్గొన్నారు.


డీలర్లతో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

ఇంటి వద్దకే రేషన్ అందించాలి

గాండ్లపెంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని స్టోర్ డీలర్లకు, ఎండీయూ వాహనదారులకు ఆర్డీవో వీవీఎస్ శర్మ సూచించారు. గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాలకు చెందిన డీలర్లు, ఎండీయూ వాహనదారులతో గాండ్లపెంట సివిల్ సప్లయ్ గోదాములో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూకాలలో తేడాలు రాకూడదని, రేషన్ సరుకులు పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, సీఎస్‌డీటీ, ఎండీయూ వాహనదారులు, డీలర్లు సమన్వయంతో పని చేయాలని అన్నారు. అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో గాండ్లపెంట, ఎన్పీకుంట ఎమ్మార్వోలు బాబురావు, దేవేంద్రనాయక్, సీఎస్‌డీటీ వాణి, స్టాకిస్ట్ వెంకటేశ్వర్లు, డీలర్లు బాబు, సంజీవరెడ్డి, నరసింహులు, మల్లయ్య, వెంకటేష్, ఎండీయూ వాహనదారులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత


సరుకులు, నగదు అందజేస్తున్న సభ్యులు

ధర్మవరం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగులబావివీధికి చెందిన సాకే శ్రీరాములు గుండెపోటుతో 15 రోజుల క్రితం మృతి చెందాడు. శ్రీరాములు కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తారక్‌ట్రస్టు గమనించి.. విషయాన్ని చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధారామవ దృష్టికి తీసుకెళ్లింది. ఆయన రూ.7వేలు నగదు, నిత్యావసర సరుకులను ఏర్పాటు చేశారు. వాటిని తారక్‌ట్రస్టు సభ్యులు సాకేశ్రీరాములు భార్య కల్యాణి, కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో కరోనా కాలంలో అడిషనల్ వర్కర్స్ కింద తక్కువ వేతనంతో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.15వేలు జీతాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇందులో ఆ సంఘం నాయకులు బాబు, ముకుంద, లక్ష్మీఓబుళేశు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్

కదిరి అర్బన్, ఫిబ్రవరి 25: రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా ఈ నెల 16న పట్టణంలోని బ్లూమూన్ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ప్రతిభ చాటిన తమీమ్, నిత్యశ్రీ, దీక్షితా రెడ్డి, జగన్మోహన్, ధ్రువి, సాయిపూర్ణిమను మంగళవారం బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ అభినందించారు.

ఈవీఎం గోదాము తనిఖీ

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌లో భద్రపరచిన ఈవీఎంల గోదాము ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవా రం తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్, టీడీపీ నాయకులు పక్రుద్దీన్, బీజేపీ నాయకులు సాకేఓబుళేశు ఉన్నారు.


గోదామును పరిశీలిస్తున్న జేసీ

న్యూస్ బాక్స్

అవకతవకలకు పాల్పడవద్దు

చిలమత్తూరు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవతకవకలకు పాల్పడవద్దని డీటీ జగన్నాథం రేషన్ డీలర్లకు సూచించారు. మంగళవారం స్థానిక తహసీలార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులను సక్రమంగా అందజేయాలని, నిర్ణయించిన ధరలకే సరఫరా చేయాలన్నారు. తూనికల్లో తేడాలు లేకుండా రేషన్ లబ్ధిదారులకు సక్రమంగా సరుకులను ఇవ్వాలన్నారు. అదేవిధంగా షాపుల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. లబ్ధిదారులందరికీ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల నుంచి పిర్యాధులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని షాపులను రద్దు చేస్తామన్నారు. ప్రతి ఒక్క డీలరు నిబంధనలు పాటిస్తూ షాపులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ శ్రీధర్, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

అగళి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18నుంచి జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారం ముగిసినట్లు ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అగళి మండలం ఇనగలూరు, అగళి సెక్టార్లలో ఆరు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు.

హిందూపురం:హిందూపురం పట్టణం, మండలంలోని అంగనవాడీ కార్యకర్తలకు ఎంజీఎం పాఠశాలలో ఆరు రోజులపాటు జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణ పొందినవారు క్షేత్రస్థాయిలో విద్యార్థుల స్థాయికి తగ్గట్టు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసన్నలక్ష్మీ, ఎంజీఎం హెచ్ఎం సామ్రాజ్యం, సీడీపీఓ శాంతి, సూపర్‌వైజర్ జయమ్మ, సరస్వతమ్మ, అనిత, రీసోర్స్‌పర్సన్‌లు గోపాల్ పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానం కొనసాగించాలి..

హిందూపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల కోసం గతంలో తీసుకొచ్చిన ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం నుంచి హెడ్‌పోస్టాఫీసు వరకు వెళ్లి ఆప్కాస్ విధానం కొనసాగించాలని లెటర్ రాసి పోస్టుబాక్సులో వేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఆయన మాట నిలబెట్టుకోలేదన్నారు. ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీనిని ఈ ప్రభుత్వం కూడా కొనసాగించాలంటూ కోరారు. అలాకాకుండా ప్రైవేట్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లను కార్మికులు అప్పజెప్పడంవల్ల శ్రమదోపిడీ జరుగుతుందని, వారికి భద్రతలేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు ,సీపీఎం నాయకులు జగదీశ్, మల్లికార్జున, రామచంద్ర, రామాంజినప్ప పాల్గొన్నారు.


గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులకు పవన్‌కుమార్, అంబికా దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం తరపున ప్రతినెలా గర్భిణులు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సీసీహరీ, సభ్యులు, వైద్యులు ఓంకార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

సోమందేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న వెంకటరమణను మంగళవారం టీడీపీ నాయకులు సీసీ హరిదాస్, రంగనగోపాల్, గట్టు మహేంద్ర తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



గృహాల కోసం ఇచ్చిన అర్జీలు చూపుతున్నదృశ్యం

సోమందేపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):మార్చి3న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమందేపల్లి మండల పరిధిలో ఇళ్లులేని నిరుపేదల నుంచి 120అర్జీలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు గృహనిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అదేవిధంగా పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

లేపాక్షి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయధికారులు సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓలు, ఫర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ఎరువులు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామన్నారు. ఎమ్మార్పీకంటే అధిక ధరలకు ఎరువులు అమ్మితే దుకాణాల్లో ధరల పట్టిక లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీలత, హిందూపురం ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్, మడకశిర ఏడీఏ కృష్ణమీనన్, డీలర్లు పాల్గొన్నారు.

వందే శివం శంకరం

మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



హిందూపురంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న దక్షిణామూర్తి ఆలయంలో ముస్తాబైన స్వామివారు



భోగసముద్రం చెరువు వద్ద విద్యుత్ దీపాలంకరణలో ధ్యాన యోగీశ్వరుడు



హేమావతిలో ప్రత్యేక అలంకరణలో హెంజేరు సిద్దేశ్వరస్వామి



పావగడ సమీపంలోని కామిని కొండలో రామలింగేశ్వరుడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని ప్రధాన శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం శివరాత్రి సందర్భంగా బసవనపల్లిలోని అతిపెద్ద 40అడుగుల భారీ విగ్రహంతోపాటు ఆలయంలో మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అదేవిధంగా సూరప్పకట్ట వద్ద ఉన్న దక్షిణా మూర్తి ఆలయం, శ్రీకంఠాపురం శ్రీకంటేశ్వర ఆలయం, మేళాపురం భవానీశంకర్ ఆలయం, నానెప్పనగర్‌లోని శివాలయం ఐదులాంతర్ల సర్కిల్‌లో శివాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే పెనుకొండ పట్టణంలోని ప్రసిద్ధిచెందిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, అవిముక్తేశ్వరస్వామి ఆలయం, ఘనగిరి సోమేశ్వరస్వామి ఆలయం, భోగలింగేశ్వరుడు, శతకోటి లింగేశ్వరస్వామి ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారంరాత్రి 10గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు కాంతార నృత్యప్రదర్శన నిర్వహిస్తారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, రాత్రికి గిరిజా కళ్యాణం, యామపూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఘనగిరి సోమేశ్వరస్వామి, అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు, రాత్రికి గిరిజా కళ్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. చిలమత్తూరు మండలంలోని కొడికొండలో వెలసిన పంచనందీశ్వరాలయంలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. వేదమంత్రాల మధ్య గిరిజా కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. శివుడు మనిషి రూపంలో కనబడే ఏకైక ఆలయం హేమావతిలో, పావగడ సమీపంలోని రామలింగేశ్వరాలయంలో కూడా వేడుకలు ఘనంగా జరగనున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా వచ్చిన భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. -- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

అన్ని చెరువులను నింపండి

● మంత్రికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వినతి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఆయన మంగళవారం విజయవాడలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మంత్రితో పలు సమస్యలపై చర్చించారు. ఈ చర్చల్లో ఆయన వెంట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కూడా ఉన్నారు. గొల్లపల్లి నుండి నేరుగా బైపాస్ కెనాల్ ఏర్పాటు చేసి చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సైతం సానుకూలంగా స్పందించారు. అనంతరం రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.



మంత్రి రామానాయుడుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

పచ్చని పంటలతో అలరారుతున్న పల్లెలు



సోమఘట్ట చెరువు కింద వరి నాట్లతో పచ్చగా మారిన పొలాలు

● రబీలో పెరిగిన వరిమళ్లు

చిలమత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):పచ్చని పంటలతో పల్లెలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. రబీ సీజన్లో భాగంగా మండలంలో ఎక్కువ మంది రైతులు వరి పంటసాగుకు మొగ్గు చూపడంతో బీడు భూములు సైతం పచ్చగా మారిపోయాయి. చెరువులు కుంటలు, బోరుబావుల కింద వరి పంటకు రైతులు ప్రాధాన్యం ఇవ్వడంతో పల్లెల్లో పచ్చని వాతావరణం సంతరించుకుంది. మండలంలో చిలమత్తూరు, కోడూరు చెరువులు మినహా మిగిలిన చెరువుల కింద పంటల సాగు జరుగుతోంది. దాంతో పచ్చని పంటలతో ఎంతో ఆహ్లాదకరంగా పల్లెలు మారిపోయాయి. సోమఘట్ట, చెరువుకిందపల్లి గ్రామాల్లో ఎక్కువగా వరి నాట్లు వేశారు. దాంతో ఎన్నో రోజులుగా బీళ్లుగా ఉన్న పొలాలు సైతం ఈ ఏడాది వేస విని అధిగమించి పచ్చదనంతో నిండిపోయాయి. కొడికొండ- గోరంట్ల రోడ్డుకి ఇరువైపుల ఈ పొలాలు ఉండడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

మారుతున్న రహదారుల రూపురేఖలు

మడకశిర,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దెబ్బతిన్న రహదారుల రూపు రేఖలు మారుతున్నాయి. మడకశిర నియోజకవర్గంలో 30 కిలో మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్ల మర్మ్మతులకు నిధులు మంజూరు కావడంతో, వాటి మర్మత్తులు కూడా వేగవంత మయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులకు లక్షలాది రూపాయిలు నిధులు మంజూరు చేయడమే గాక మరమ్మతులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు.

రోడ్డుకు ఇరువైపువల ఉన్న కంప చెట్లను తొలగించారు. పట్టణంలోని వడ్రపాళ్యం నుంచి మధుగిరి రోడ్డు లోని వెటర్నరీ పాఠశాల వరకు ప్రధాన రహదారి మరమ్మతుకు రూ.16 కోట్లు మంజూరు చేశారు. మడకశిర ఆర్‌అండ్‌బి పరిధిలోని మడకశిర మండలం భక్తరపల్లి రోడ్డు, బుళ్ళసముద్రం వెంకటమ్మపల్లి రోడ్డు, పరిగి యూ.రంగాపురం రోడ్డు, గోవిందాపురం కేకాతి రోడ్డు, గుండుమల- ఎస్.రాయపురం రోడ్డు, గంగళవాయిపాళ్యం రోడ్లు వర్షానికి దెబ్బతిని గుంతల మయం అయ్యాయి. మంజూరు అయిన నిధులతో మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలో రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. నియోజకవర్గంలో 190 కిలోమీటర్లకు గాను 180 కిలో మీటర్ల రోడ్లకు మరమ్మతులు పూర్తి అయ్యాయని ఆర్‌అండ్‌బి ఏఈ నరసింహామూర్తి తెలిపారు.



హేమావతిలో రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):బుళ్ళసముద్రం ఎస్సీకాలనీలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా పంచాయితీ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'నడిరోడ్డుపై మురుగునీరు' శీర్షికతో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. వెంటనే రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా తగు చర్యలు తీసుకున్నారు. అదే విధంగా వ్యాధులు సోకకుండా బ్లీచింగ్ పౌడరు కూడా వేయించినట్లు పంచాయితీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం

అగళి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగరమహళ్లి గ్రామానికి చెందిన రమేష్, వన్నమ్మ దంపతుల కుమార్తె అమూల్య(17) మంగళవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఎస్ఐ వీరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమూల్య పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటి వద్దే ఉంటూ గొర్రెలను మేపుతుండేది. ఓ యువకుడితో ప్రేమలో పడినట్లు తెలిసింది. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మంగళవారం ఉదయం ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబీకులు బెంగళూరు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. అమూల్య శరీరం 60శాతం వరకు కాలిపోయిందని ఎస్ఐ తెలిపారు.

అగ్నికి ఆహుతైన మామిడి, చింతచెట్లు

అగళి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చెట్లను పెంచి పోషిస్తే అవి తమకు జీవనోపాధినిస్తాయని పెంచిన మామిడి, చింత, వేప, నిమ్మ, సపోటా తదితర చెట్లు అగ్నికి ఆహుతైన సంఘటన సోమవారం మండలంలోని హనిషేకుంట రోడ్డులో చోటుచేసుకుంది. అగళి మండలం డొక్కలపల్లి గ్రామానికి చెందిన రైతు కె.టి. తిమ్మప్ప తన భూమిలో పండ్లచెట్లు పెంచుకున్నాడు. వీటికి బిందు సేద్య పరికరాలు కూడా ఏర్పాటుచేసుకున్నాడు. గుర్తుతెలియని దుండగులు వాటికి నిప్పుపెట్టడంతో వంద చింతచెట్లు, 80వేపచెట్లు, 60మామిడిచెట్లు, 15సపోట చెట్లు, 10నిమ్మచెట్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

రంగనాథస్వామికి పూజలు

గుడిబండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం పి.ఎన్.పాళ్యం గ్రామానికి చెందిన గ్రామస్తులు మంగళవారం రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలానికి సరిహద్దు కర్ణాటక ప్రాంతమైన పడమారనహళ్లి గ్రామ సమీపంలో వెలిసిన రంగనాథస్వామిని పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

మడకశిరటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయ సమీపంలో ఉదయం 7గంటల సమయంలో మంగళవారం ఉదయం పావగడ నుంచి మధుగిరికి వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొంది. సిమెంటు బస్తాలతో వస్తున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌పై అదుపుతప్పి దూసుకెళ్లింది. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి



ఈశ్వరమ్మ (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రంగనాయకులు సతీమణి ఈశ్వరమ్మ(61) అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె మృతిపట్ల మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్, టీడీపీ నాయకులు నెట్టప్ప, పామిశెట్టి శేఖర్, బండారు బాలాజీ, అమర్నాథ్, కోరుముట్ల నాగేంద్ర సంతాపం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, గుడ్డంపల్లి వేణురెడ్డి.. ఈశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు.

శ్రీధర్ సతీమణి మృతి



భారతి (ఫైల్)

బీఎస్‌టీ బస్సుల ట్రాన్స్‌పోర్ట్ యజమాని బీఎస్ శ్రీధర్ సతీమణి భారతి (68) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి పలువురు నివాళులు అర్పించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా హర్షకుమార్



పెనుకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెనుకొండకు చెందిన హర్షకుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. సోమవారం పెనుకొండలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో హర్షకుమార్‌ను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు.


గొడౌన్‌లో అగ్ని ప్రమాదం



చెలరేగుతున్న మంటలు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ సమీపంలోని యాడికి నాగరాజు అయిల్ మిల్ గోడౌన్‌లో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన రిజ్వాన్, కియా అనుబంధ పరిశ్రమ నుంచి వచ్చే వేస్ట్ మెటీరియల్‌ను ఆయిల్‌మిల్లు గోడౌన్‌లో డంప్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు డంప్‌కు నిప్పు పెట్టడంతో గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ సంఘటనలో రూ.1.80లక్షలు నష్టం వాటిల్లినట్లు రిజ్వాన్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, కమిషనర్ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఇళ్లమధ్యలో స్క్రాప్ గోడౌన్ ఏర్పాటు చేసిన మిల్లు యజమానికి, రిజ్వాన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

అగ్నికి ఆహుతవుతున్న పచ్చనిచెట్లు



భూతప్ప కనుమలో కాలిపోయిన చెట్లు

గుడిబండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చనిచెట్లను పెంచేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. వన సంరక్షణ సమితి, ఉపాధి హామీ, తదితర పథకాల ద్వారా చెట్లను పెంచేందుకు కృషిచేస్తున్నాయి. మరోవైపు మండలంలోని ఎస్ఎస్‌గుండ్లు, భూతప్ప కనుమ, హాట్టేబెట్ట, తదితర అటవీ ప్రాంతాల్లో గుర్తుతెలియనివ్యక్తులు నిప్పుపెట్టడంతో చెట్లు అగ్నికి ఆహుతై పోతున్నాయి. ఇకనైనా అటవీశాఖ అధికారులు చెట్లు బుగ్గి కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్.రాయపురంలో చెట్లు దగ్ధం

గుడిబండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన గుండప్పకు చెందిన మామిడిచెట్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. రెండు ఎకరాల్లో సాగుచేసిన మామిడి చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూతదశలో ఉన్న మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో తీవ్రంగా నష్టపోయానని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిఆదుకోవాలని కోరాడు.